సాక్షి రంగారెడ్డి

బుధవారం । 22 । నవంబర్ । 2023



మరోసారి అధికారం మనదే

ప్రజలంతా కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య కోరారు. 10లో▸



ఓటుతో బుద్ధి చెప్పండి

సంక్షేమ పథకాల అమలుకు అడ్డుపడుతున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ అన్నారు. 10లో▸

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఇబ్రహీంపట్నం: శేరిగూడ సమీపంలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ఓపీఎస్‌ల కు(ఎన్నికల సిబ్బంది) బుధవారం శిక్షణ ఇస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ఆదే కళాశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఓపీఎస్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

మైసిగండి హుండీ ఆదాయం రూ.8.67 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కడ్తాల్: మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ రామాలయా దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ సమక్షంలో, దేవాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం 54 రోజులకు గాను, భక్తులు కానుకల రూపేణ వివిధ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ 8,67,285 సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ చంద్రకుమార్, ఎస్ఐ వరప్రసాద్

కేశంపేట: ప్రజలు భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏసీపీ చంద్ర కుమార్ అన్నారు. కేశంపేట ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్‌తో కలిసి మండలంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.50వేలకు మించి డబ్బులు తరలించవద్దని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. అనంతరం తొమ్మిదిరేకుల గ్రామంలో ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

'గ్యారెంటీ'గా అన్ని వర్గాల సంక్షేమం



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఏపీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

మీర్‌పేట: అన్ని వర్గాల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను ప్రకటించిందని పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట గాయత్రీనగర్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలంతా కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారని.. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమని జోస్యం చెప్పారు. మహేశ్వరంలో హస్తం గుర్తుకు ఓటు వేసి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, మాజీ ఎంపీపీ కందాళ బాబు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ కొప్పుల ప్రవీణ్‌కుమార్, ఎడ్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్

• వృద్ధులు, దివ్యాంగులు 1,792



ఇబ్రహీంపట్నం: ఇంటివద్దే ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధుడు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా మంగళవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ గతంలో ఎన్నడూ లేని విధంగా దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది. 12డి ఫాం కింద జిల్లా వ్యాప్తంగా 1,988 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,792 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోం బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో భాగంగా 100 బృందాలను ఏర్పాటు చేసి సోమ, మంగళవారాల్లో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 54 మందికి 45 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎల్బీనగర్‌లో 422 మందికి 406 మంది, మహేశ్వరంలో 266 మందికి 232 మంది, రాజేంద్రనగర్‌లో 339 మందికి 290 మంది, శేరిలింగంపల్లిలో 377 మందికి 331 మంది, చేవెళ్లలో 231 మందికి 209 మంది, కల్వకుర్తిలో 102 మందికి 91 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

• పోలీస్ సిబ్బంది 1,520



చేవెళ్ల: ఓటు హక్కు వినియోగించుకుంటున్న పోలీసు సిబ్బంది

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పోలీసు సిబ్బంది మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 1,520 మంది పోలీసు సిబ్బంది ముందస్తుగా ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలో 364 ఓట్లు, ఎల్బీనగర్‌లో 224, మహేశ్వరంలో 289, రాజేంద్రనగర్‌లో 183, శేరిలింగంపల్లిలో 126, చేవెళ్ల 261, కల్వకుర్తిలో 17, షాద్‌నగర్‌లో 56 మంది చొప్పున తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వంద శాతం పోలింగ్ అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు

ఓటర్లే → టార్గెట్ గెలుపే



వ్యూహ, ప్రతివ్యూహాలు

- పక్కాగా ప్రణాళికలు
- పోటాపోటీ ప్రచారాలు
- గాలాలు, తాయిలాలు
- పెరిగిన పొలిటికల్ హీట్

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడుతుండడంతో అభ్యర్థులు జోరు పెంచారు. పోటాపోటీ ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఒక వైపు కుటుంబసభ్యులు, బంధుగణాన్ని రంగంలోకి దింపగా.. మరోవైపు ద్వితీయశ్రేణి నాయకులతో ఇంటింటికీ తిరిగేలా చూసుకుంటున్నారు. తమ మేనిఫెస్టోలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచారం సాగిస్తున్నారు. రోజులు గడుస్తుండడంతో రోజుకోరకమైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఆయా నియోజకవర్గాలను ఓ రౌండ్ చుట్టేశారు. వీలైనంత వరకు మరోసారి తిరిగేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రచారాలు కొనసాగిస్తూనే నియోజకవర్గాల వారీగా భారీ బహిరంగ సభలు, ర్యాలీలతోపాటు ఓటర్లను ఆకట్టుకునేందు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అగ్రనేతలను జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ప్రచారాలకు పిలుస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల ప్రధాన నేతల రోడ్ షోలు, బహిరంగ సభలు నిర్వహించారు. ఈ వారం రోజుల్లో పెద్ద సంఖ్యలో బహిరంగ సభలు, రోడ్‌షోలు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా నియోజకవర్గాల్లో కలియ తిరుగుతున్నారు.

బూత్‌స్థాయి కమిటీలతో ప్రచారం..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వీలైనంతగా ఓటర్లను కలిసేందుకు బూత్‌స్థాయి ప్రచారాలపై దృష్టి సారిస్తున్నారు. ప్రతి గ్రామంలో బూత్‌స్థాయి కమిటీల ఏర్పాటుతో ఓటర్లను నేరుగా కలిసి ఓటర్లను ఆకర్షించేందుకు సిద్ధమవుతున్నారు. ఇతర పార్టీల కదలికలను నిశితంగా గమనిస్తూ దానికి అనుగుణంగా పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్నారు. దీని కోసం సామాజిక మాధ్యమాలను విరివిగా వినియోగించుకుంటున్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో పార్టీల పరంగా, కులాల వారీగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లపై దృష్టి సారించారు. ఆయా గ్రూప్‌ల్లో ఉన్న తమ పార్టీలకు చెందిన నాయకుల ద్వారా మెసేజ్‌లు చేరేలా చూస్తున్నారు.

డబ్బు, మద్యం పంపిణీపై దృష్టి

ఎంత ప్రచారం సాగించినా.. ఎన్ని ఎత్తుగడలు వేసినా చివరికి ఓటర్లకు గాలం వేసేందుకు ఓటుకు నోటు.. మద్యం తప్పవని భావిస్తున్న అభ్యర్థులు ఈ మేరకు పంపిణీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రధాన పార్టీల అభ్యర్థులు నువ్వా.. నేనా అన్నట్లు పలు నియోజకవర్గాల్లో పోటీ పడుతున్నారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా కదన రంగంలో దూసుకెళ్తున్నారు.

ప్రచారానికి అగ్రనేతలు



సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

- 23న సుల్తాన్‌పూర్‌కు సీఎం కేసీఆర్
- 25న తుక్కుగూడకు ప్రధాని మోదీ
- హీటెక్కిన ఎన్నికల ప్రచారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరో వారం రోజుల్లో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఓటింగ్ సమయం దగ్గరపడుతోంది. దీంతో ప్రధాన పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారానికి ఆయా పార్టీల అగ్రనేతలు మహేశ్వరం నియోజకవర్గానికి రానున్నారు. ఇందులో భాగంగా ఎయిర్ పోర్టు రోడ్డుకు సమీపంలోని సుల్తాన్‌పూర్‌లో ఈ నెల 23న నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితా రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం మంత్రి సభాస్థలిని పరిశీలించారు.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ తరఫున ప్రచారం చేసేందుకు ఈ నెల 25న ప్రధాని నరేంద్రమోదీ నియోజక వర్గానికి రానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు తుక్కుగూడ వేదికగా నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. ఇక కాంగ్రెస్ నేతలు కూడా అగ్రనేతలను ప్రచారానికి రప్పించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఎన్నికల గడువు దగ్గరపడుతున్న కొద్దీ ప్రచారం హీటెక్కుతోంది. అగ్రనేతల వరుస పర్యటనల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు.

భారీగా మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో డీసీపీ తదితరులు


తలకొండపల్లి: మండల పరిధిలోని జూలపల్లిలో భారీగా మద్యం పట్టుబడింది. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని జూలపల్లిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి కోళ్ల ఫారంలో అక్రమంగా మద్యం నిల్వ చేశారు. సమాచారం అందుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీను సిబ్బందితో వెళ్లి తనిఖీ చేపట్టారు. 204 కాటన్లలో 9,792 బాటిళ్లలో 1,760 లీటర్ల మద్యం నిల్వ చేసినట్లు గుర్తించారు. మద్యాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డితో పాటు, రాజు, లక్ష్మారెడ్డి, యాదయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.19.38 లక్షలు ఉంటుందని అడిషనల్ డీసీపీ తెలిపారు. తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, ఆయా గ్రామాల్లో ప్రత్యేక దళాలను నియమించి, గట్టి నిఘా ఉంచనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విఠాయిపల్లి సమీపంలో ..

ఆమనగల్లు: మండలంలోని విఠాయిపల్లి గ్రామ సమీపంలో తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం తెలిపారు. మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బొలెరో వాహనంలో తీసుకెళ్తున్న 25 బాక్సుల మద్యం బాటిళ్లను ఎస్ఓటీ, స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు వివరించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.2.30 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ మేరకు కందుకూరు మండలం దెబ్బడగూడకు చెందిన సలీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి: ఎంపీ

మర్పల్లి: మరో వారం రోజులు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పార్టీకోసం కష్టపడితే విజయం మనదేనని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మర్పల్లిలోని బీఎర్ఎస్ పార్టీ బూత్‌లెవల్ కార్యకర్తలకు (సభ్యులకు) మంగళవారం ఎన్నికల విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బూత్‌లెవల్ కార్యకర్తలు వికారాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆనంద్ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతి బూత్‌లెవల్ కార్యకర్తకు పోటీ చేస్తున్న సభ్యుల సంఖ్యతో కూడిన పార్టీ గుర్తులు కలిగిన నమూనా బ్యాలెట్‌ను అందజేశారు. అనంతరం మండల పరిధిలోని దామస్తాపూర్‌కి చెందిన 30 మంది కార్యకర్తలు ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మధుకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ ప్రసిడెంట్ మధుకర్, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌస్, రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, మర్పల్లి ఎంపీటీసీ వసంత్, నాయకులు పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

అదనపు డీసీపీ నర్సింహారెడ్డి

ఆమనగల్లు: ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను ఉంచుతామని అదనపు డీసీపీ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ నెల 30న పోలింగ్ కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించి కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహిస్తే ముందుగా ఎన్నికల అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్‌లు ఉన్న వారిని బైండోవర్ చేయడం జరిగిందని, వారి కదలికలపై నిఘా ఉంచినట్లు వివరించారు. ఎవరైనా డబ్బులు, మద్యం పంపిణీ చేసినట్లతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న అదనపు డీసీపీ నర్సింహారెడ్డి

స్వేచ్ఛగా ఓటు వేయాలి

కడ్తాల్: ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో మంగళవారం సాయంత్రం ఓటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఓటర్లకు మద్యం, డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అలా అయితే రాష్ట్రం ఆగమైతది

- రోడ్‌షోలో మంత్రి కేటీఆర్
- 'తలసాని'కి మద్దతుగా ప్రచారం



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

అమీర్‌పేట: హైదరాబాద్ నగరం బాగుంటేనే తెలంగాణ రాష్ట్రం బాగుంటుంది..హైదరాబాదే మనకు కామధేనువు.. దీనిని అడ్డమైన వారి చేతిలో పెడితే తెలంగాణ ఆగమైతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ నాయకులనుద్దేశించి పేర్కొన్నారు. పిల్ల దొరక్క ముందే పెళ్లికి ముహూర్తాలు పెట్టుకున్న చందంగా రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల తీరు ఉందని.. ఎన్నికల్లో గెలవలేని స్థితిలో ఉన్నా సీఎంలుగా ప్రమాణం చేస్తామని తేదీలను ప్రకటించుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం రాత్రి సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతుగా అమీర్‌పేటలో రోడ్ షో నిర్వహించారు. సత్యం థియేటర్ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ..పదవుల కోసం ప్రాణాలు తీసే పార్టీలను నమ్ముదామా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు నా కంటే ప్రజలకే బాగా తెలుసని అన్నారు. గతంలో సనత్‌నగర్ నుండి గెలుపొంది సీఎం అయిన మర్రి చెన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ గురించి చెప్పిన మాటలను గుర్తు చేశారు. నన్ను సీఎం పదవి నుంచి దించేందుకు మా వాళ్లే మతకల్లోలాలకు తెరతీశారని స్వయంగా మర్రి చెన్నారెడ్డి అన్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేదని.. ఇపుడు 24 గంటలు ఇస్తే అసలు కరెంటు ఎక్కడుంటోందని రేవంత్‌రెడ్డి అంటున్నారన్నారు. బీజేపీ నాయకుల మాటలను కూడా ప్రజలు నమ్మరాదని సూచించారు. ఒక్క కేసీఆర్‌కు వ్యతిరేకంగా దేశ ప్రధానితో పాటు అమిత్‌షా, బీజేపీ ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు తెలంగాణకు వస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం వచ్చి మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మితే మనం మోసపోతామన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తలసాని సాయి కిరణ్ యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, గులాబ్‌సింగ్, లలితాచౌహాన్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పరిశీలన



కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకులతో సమావేశమైన రాష్ట్ర అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. రాష్ట్ర వ్యయ పరిశీలకులు ఐఆర్ఎస్ అధికారి బాలకృష్ణ, ఏపీఎస్ అధికారి రాష్ట్ర పోలీస్ అబ్జర్వర్ దీపక్‌మిశ్రా, కలెక్టర్ భారతి హోళికేరి, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయానికి విచ్చేశారు. సమీకృత జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కంట్రోల్‌రూంలను సందర్శించారు. రికార్డింగ్, ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. 1950 టోల్‌ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, వాటిని పరిష్కరిస్తున్న తీరును గమనించారు. చెక్‌పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీ బృందాల పనితీరు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరు, కంట్రోల్ రూంలో జీపీఆర్ఎస్ విధానం ద్వారా పర్యవేక్షిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ భారతి హోళికేరి, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో పాటు ఆయా నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ప్రియరంజన్ శ్రీవాస్తవ, వినోద్‌కుమార్ అహిర్వార్, శంకర్‌గుప్తా, జనార్దన్, పోలీసు పరిశీలకులు ఉత్పల్ కుమార్ నస్కర్ అజిత్‌సింగ్ యాదవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఎనిమిది నియోజకవర్గాల్లో 209 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, ఇప్పటికే అన్ని సెంటర్లకు ఈవీఎంలు, పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ర్యాండమైజేషన్ సైతం పూర్తయిందని చెప్పారు. జిల్లాలో 3,453 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూస్తున్నామన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, నోడల్ అధికారులు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గులాబీ' గూటికి 'కమలం' నేత


మంత్రి కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల వేళ నేతలు పార్టీలు మారడం అధికార ప్రతిపక్ష పార్టీలకు తలనొప్పిగా మారింది. తాజాగా మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పటోళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. నగరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గులాబీ కండువా కప్పుకున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

బండ్లగూడ: ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించుకున్నప్పుడే సమాజం మారుతుందని బండ్లగూడ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మే రకు నవంబర్ 30న జరగనున్న పోలింగ్‌లో ఓటుహక్కు వినియోగించుటకు అవసరమైన ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్(వీఐఎస్), ఓటర్ గైడ్ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, వెంకటేశ్వర కాలనీ, వికాస్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సంబంధిత బూత్ లెవ్ ఆఫీసర్స్(బీఎల్‌ఓ), సూపర్ వైజర్ ఆఫీసర్స్‌తో వీటిని పంపిణీ చేశారు. ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్(వీఐఎస్)ను తీసుకు రావాలన్నారు. ఈ నెల 22న సాయంత్రం 5 గంటల వరకు ఈ స్లిప్‌ల పంపిణీ జరుగుతుందన్నారు. బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నారన్నారు.

పోలీసులు ముందే ఓటేశారు


ఇబ్రహీంపట్నం: ఎంపీడీఓ కార్యాలయంలో ఓటేస్తున్న ఉద్యోగి


పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద నాయకుల హడావుడి

- 1214 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం
- మొదటి రోజు ఓటుహక్కు వినియోగించుకున్న 364 మంది ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 1214 మంది ఓటర్లు పోలీస్ శాఖల్లో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. ఎన్నికల సంఘం వారికి మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. ఇబ్రహీంపట్నంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వారు ఓటేశారు. మొదటి రోజు 364 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. బుధవారం ఓటేసేందుకు అవకావం ఉందన్నారు.

ఓటర్లకు ప్రలోభాలు

ఫెసిలిటేషన్ సెంటర్ సమీపంలో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేయాలని ఆయా పార్టీ శ్రేణులు ఓటర్లను ప్రక్కకు తీసుకెళ్లి తమ అభ్యర్థులకు ఓటు వేయాలని డబ్బులు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పోలింగ్ రోజు పార్టీ శ్రేణుల ప్రచారం మాదిరిగానే మంగళవారం ఫెసిలిటేషన్ సెంటర్ పరిసరాల్లో కనిపించడం గమనార్హం.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగం

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి ప్రారంభించిన ఈ పోలింగ్‌లో 261 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. పోలీసులకు సంబంధించి 971 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు కలిగి ఉండగా అందులో 261 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. హోం ఓటింగ్‌లో భాగంగా సీనియర్ సిటిజన్లు 177 మంది ఉండగా 160 మంది ఓటు వేశారని తెలిపారు. దివ్యాంగులకు సంబంధించి 54 మంది ఓటర్లు ఉండగా 49 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వివరించారు. పోస్టల్ ఓటింగ్ ఉపయోగించుకునే పోలీసు ఉద్యోగులకు బుధవారం కూడా అవకాశం ఉంటుందని చెప్పారు.

వారు ఇంటి వద్ద వేశారు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నిర్వహించిన హోం ఓటింగ్‌లో సోమ, మంగళవారాల్లో 45 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వృద్ధులు, 40శాతంకు పైగా వైకల్యం ఉన్న దివ్యాంగుల కోసం రాష్ట్రంలో తొలిసారిగా హోం ఓటింగ్ విధానం తీసుకువచ్చారు. నియోజకవర్గంలో 52 మందిని అర్హులుగా గుర్తించగా... మూడు బృందాలు హోం ఓటింగ్‌ను నిర్వహించాయి. ఇందులో 45 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా అరుగురు అందుబాటులోకి లేరని, మరొకరు చనిపోయినట్లు అనంతరెడ్డి తెలిపారు. ఓటు వేయని వారికి మరో అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు.

మరోసారి అధికారం మనదే

బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య


కేతిరెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: ముచ్చటగా మూడోసారి అధికారం మనదేనని.. ప్రజలంతా కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య కోరారు. మంగళవారం ఆయన మండలపరిధిలోని కేతిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఇతర పార్టీల నేతలు స్వచ్ఛందంగా గులాబీ పార్టీలో చేరుతున్నారన్నారు. అనంతరం సర్పంచ్ శోభారెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్లలో కాలె యాదయ్య హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అనంతరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు శ్రీహరి యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుఫ్, మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ విఫలం

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి


జీపీ కార్మికులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని పంచాయతీ కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలుగా కార్మికులకు జీతాలు రావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉండి కార్మికుల సమస్యలను గాలికొదిలేసిందని ఆయన అరోపించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సమ్మె చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జీపీ కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్న పార్టీకే మా మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, రాంచంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

బీఆర్‌ఎస్ షాద్‌నగర్ అభ్యర్థి అంజయ్యయాదవ్


గజమాలతో అంజయ్యయాదవ్‌కు స్వాగతం పలుకుతున్న జంగోనిగూడ గ్రామస్తులు

నందిగామ: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అడ్డుపడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ షాద్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని జంగోనిగూడ, అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ, వెంకమ్మగూడ, చేగూరు, బండోనిగూడ తదితర గ్రామాలలో ప్రచారాన్ని చేపట్టారు. ఆయా గ్రామాలలో రోడ్ షో, ర్యాలీలలో అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు సమయంలో అసత్య ప్రచారాలతో తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పోరాట పటిమతోనే రాష్ట్రం సిద్ధించిందన్నారు. రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మరోసారి అధికారం ఇవ్వాలని కోరారు. గ్రామాలు అభివృద్ధిలో పట్టణాలకు తీసిపోకుండా ఉన్నాయన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తానన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, గోవిందు అశోక్, సంతోష, రజనీత, కుమార్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, ఎంపీటీసీ సభ్యురాలు కలమ్మ, ఉప సర్పంచ్‌లు శేఖర్, కుమార్ గౌడ్, నాయకులు నారాయణ రెడ్డి, నీలమ్మ, విజయ్, నీరటి సురేందర్, కుమార్, రాజేందర్, సుదర్శన్ గౌడ్, రమేష్, నర్సింహ, సురేశ్, శ్రీనివాస్ గౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, యాదయ్య, రాజు, శ్రీనివాస్, మల్లేశ్, శేఖర్, జనార్దన్ రెడ్డి, విక్రం శర్మ, మాజీ సర్పంచ్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ రాజేంద్రనగర్ అభ్యర్థి నరేందర్ ముదిరాజ్


ప్రజలకు అభివాదం చేస్తున్న నరేందర్

రాజేంద్రనగర్: నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ కోరారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో మంగళవారం రోడ్‌షో, ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయన ఈ ప్రచారం చేశారు. గాంధీనగర్ నుంచి ప్రారంభమైన ప్రచారం ఎర్రబోడ వరకు సాగింది. అడుగడుగునా మహిళలు హారతులు పడుతూ.. స్వాగతం పలికారు. గాంధీనగర్, రాజేంద్రనగర్, మాణిక్యమ్మ కాలనీ, బుద్వేల్, రజక బస్తీ, భగవతిగూడ, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లిలో స్థానిక ప్రాంతాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. మూడు దఫాలుగా నియోజకవర్గ ఎమ్మెల్యే విజయం సాధించినా.. ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీయే సుస్థిరమైన పాలన, అభివృద్ధి పనులకు నిధులను అందిస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజేంద్రనగర్ అభివృద్ధి చెందాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు హామీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. 6 హామీలు ప్రతి గడపకు అందేలా తానే కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్...

రాజేంద్రనగర్ డివిజన్ మాజీ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ కోరని శ్రీలతా మహత్మ తన అనుచరులతో మంగళవారం పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కస్తూరి నరేందర్ సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుల రాజకీయాలను ప్రోత్సహిస్తుండటంతో తాము పార్టీ నుంచి బయటికి వచ్చినట్లు తెలిపారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓడిపోయిన అనంతరం దళితులం కావడంతో తమను పక్కన పెట్టారని ఆరోపించారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లిలో పోటీ చేసిన వారు తమ వారు కావడంతో ఎమ్మెల్యే అక్కున చేర్చుకున్నాడని, తమను మాత్రం పార్టీకి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మనస్థాపంతో కాంగ్రెస్‌లో చేరానన్నారు. వనం శ్రీరాంరెడ్డి, కోరని బాల్‌రాజ్, కృష్ణమాచారి, అక్కిరాజు రాధేశ్యామ్, కోరని శ్యామ్, సదాలక్ష్మి, పెండ్యాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నరేందర్ గెలుపు అభివృద్ధికి మలుపు..

మణికొండ: ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పార్టీ నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారు స్థానికంగా ఉండే వ్యక్తి ఎమ్మెల్యేగా ఎన్నికైతే మన ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే మణికొండ మున్సిపల్ చైర్మన్‌గా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, అదే తరహాలో భవిష్యత్తులో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తమ ఓటు చేతి గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. మణికొండ మాజీ సర్పంచ్ నరేష్, మాజీ ఎంపీటీసీ రాజు, సాయిరెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, ఇందిర, పార్టీ నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, రాము, వినోద్‌కుమార్, వెంకటేష్ తదితరులున్నారు.

పోలింగ్ శాతం పెంచుతాం

- ఈ నెల 23 వరకు ఓటరు స్లిప్‌ల పంపిణీ
- ఇళ్ల వద్దే పోలింగ్ నిర్వహణకు 27 టీంలు
- పోస్టల్ నదుపాయానికి దరఖాస్తు చేసుకోని 13 మంది సర్వీసు ఓటర్లు
- అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్
- 'సాక్షి'తో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్

అసెంబ్లీ ఎన్నికలకు దాదాపు వారం రోజులు మాత్రమే సమయముంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, ఓటర్లకు అవగాహన, పోలింగ్ స్లిప్‌ల పంపిణీ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లు, తదితర అంశాలపై 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. ఆ వివరాలిలా ఉన్నాయి. – సాక్షి, సిటీబ్యూరో

ప్ర: పోలింగ్ ఏర్పాట్ల పరిస్థితి ఎలా ఉంది?

జ: జిల్లాలో పోలింగ్ ఏర్పాట్లు ముమ్మరం చేశాం. అభ్యర్థుల సంఖ్యకనుగుణంగా అవసరమైనన్ని బ్యాలెట్ యూనిట్లు వచ్చాయి. తొలుత 7,907 అందుబాటులో ఉండేవి. అభ్యర్థుల సంఖ్యకనుగుణంగా రిజర్వులో ఉంచాల్సిన వాటితో సహా మొత్తం 9,346 బ్యాలెట్ యూనిట్లు అవసరమని గుర్తించాం. ఆ మేరకు 1,439 యూనిట్లు తక్కువగా ఉండటంతో ఎన్నికల సంఘానికి నివేదించాం. అవి కూడా వచ్చాయి. పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణలు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాలు పెరిగిన నేపథ్యంలో అవసరమైన అదనపు సిబ్బందికి కూడా మూడో దఫా ట్రైనింగ్ కూడా పూర్తి కానుంది.

ప్ర: ఇళ్ల వద్ద పోలింగ్ మొదలైందా ?

జ: వయస్సు 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దనే పోలింగ్ అవకాశం ఉంది. ఈ సదుపాయానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత పొందిన 733 మంది వయోవృద్ధులు, 124 మంది వికలాంగులు తమ ఇళ్ల వద్దే ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు. ఇప్పటికే ఈ పోలింగ్ మొదలైంది. ఇందుకోసం 47 టీమ్స్ పని చేస్తున్నాయి. జిల్లాలోని 15 నియోజకవర్గాలకు గాను ఒక్క కంటోన్మెంట్‌లో తప్ప మిగతా చోట్ల ఈ పోలింగ్ మొదలైంది. కంటోన్మెంట్‌లో 22వ తేదీన మొదలవుతుంది. ఈ మేరకు ఇప్పటికే సదరు ఓటర్లకు సమాచారం అందించింది.ఒకటి రెండు రోజుల్లో ఇది పూర్తవుతుంది.

ప్ర: వీరు కాక ఇంకా ఏయే వర్గాల వారు ఇళ్ల వద్ద పోలింగ్‌లో పాల్గొనవచ్చు?

జ: వేరే ఎవరికీ ఈ సదుపాయం లేదు. పోలింగ్ విధుల్లో పాల్గొనే పోలీసు, పోలింగ్ సిబ్బందితో పాటు పోలింగ్ రోజున ఎన్నికల విధులకు హాజరయ్యే 13 అత్యవసర సేవల విభాగాల్లోని వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఉంది. ఈ విభాగాల్లోని వారికి పోస్టల్ బ్యాలెట్ అంటే పోస్టులో పంపేది కాదు. ఇందుకు దరఖాస్తు చేసుకున్నవారు నిర్ణీత తేదీల్లో సూచించిన కార్యాలయానికి వెళ్లి ముందస్తుగానే ఓటు వేయవచ్చు. పోలీసులకు, పోలింగ్ విధులకు హాజరయ్యే వారికి ఈ పోలింగ్ కూడా మొదలైంది. మిగతా 13 అత్యవసర విభాగాల నుంచి మాత్రం ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు.

ప్ర: జిల్లాలో ఎన్ని పోలింగ్ కేంద్రాలున్నాయి.. ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

జ: పెరిగిన ఓటర్ల సంఖ్యకనుగుణంగా అనుబంధ పోలింగ్ కేంద్రాలతో వెరసీ.. మొత్తం 4,119 పోలింగ్ కేంద్రాలుంటాయి. ప్రజలు సౌలభ్యంగా ఓటు వేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే గుర్తించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. ఎన్నికల సంఘం ఎంపిక చేసిన ఏజెన్సీ ఈ ఏర్పాట్లు చేస్తుంది. అన్ని పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితుల్ని ఎన్నికల సంఘం నుంచి, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి కూడా పరిశీలించవచ్చు.

ప్ర: ఓటరు స్లిప్పుల పంపిణీ ఎంతవరకొచ్చింది ?

వాటిని ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్స్ అంటున్నాం. వాటి ద్వారా ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం చిరునామా, పోలింగ్ బూత్ నెంబర్, తదితర వివరాలు తెలుస్తాయి. క్యూఆర్ కోడ్ ఉంటుంది.స్లిప్‌లోని సమాచారంతో సులభంగా చేరుకోవచ్చు. గూగుల్‌మ్యాప్స్ ద్వారానూ తెలుసుకోవచ్చు. 23వ తేదీకల్లా ఈ పంపిణీ పూర్తి చేయాలనేది లక్ష్యం. వీటితోపాటు ఓటు వేసేందుకు ఓటరుకు తగిన అవగాహన కలిగేలా చిన్న పుస్తకం కూడా పంపిణీ చేస్తున్నాం.

ప్ర: పోలింగ్ శాతం పెరగనుందా?

జ: నగరంలో పెద్ద సమస్య ఎక్కువమంది ఓట్లు వేయకపోవడం. గత అనుభవాల నుంచి వీలైనంతమేర పోలింగ్ శాతం పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే వివిధ కార్యాలయాల్లో, సంస్థల్లో, హోటళ్లలో, చౌరాస్తాల్లో, పర్యాటక ప్రాంతాల్లోనే కాక హైకోర్టు వంటి ప్రాంతాల్లోనూ ఓటరు అవగాహన కోసం 'స్వీప్' (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాలు నిర్వహించాం. రెసిడెన్షియల్‌వెల్ఫేర్ అసోసియేషన్ల భాగస్వామ్యంతోనూ ఈ కార్యక్రమాలు నిర్వహించాం. వివిధ రంగాల్లోని సెలబ్రిటీలతోనూ ప్రచారం నిర్వహించాం. ఇంకా ఎవరు ఏ సలహాలిచ్చినా పోలింగ్ పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. భారీ క్యూలలో నుంచోలేక చాలామంది పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారనే సమాచారం ఉండటంతో, ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ కేంద్రంలో ఏ గంటకు ఎంత క్యూ ఉందో తెలుసుకునే ఏర్పాట్లు చేస్తాం. దానిద్వారా పోలింగ్ కేంద్రానికి వెళ్లే వారు ప్లాన్ చేసుకోవచ్చు. మహిళలకు, యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు కూడా ఉంటాయి. మిగతా వాటికంటే అవి కొంత భిన్నంగా, ఓటర్లను ఆకర్షించేలా ఉంటాయి.